# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 18-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశ ఆదాయార్జన వ్యవస్థలను ఆధునీకరించడమే భావితరం జీఎస్టీ సంస్కరణల లక్ష్యమని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

- ❖ ప్రయాణికుల భద్రత కోసం భారతీయ రైల్వే ప్రతి సంవత్సరం ఒక లక్షా 30 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేస్తోందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

- ❖ మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి అన్నపూర్ణాదేవి తెలిపారు.

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28న ప్రసారమవుతుంది.

======================

దేశ ఆదాయార్జన వ్యవస్థలను ఆధునీకరించడమే భావితరం జీఎస్టీ సంస్కరణల లక్ష్యమని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కోల్‌కతాలోని నేషనల్ లైబ్రరీలో భావితరం GST సంస్కరణల కమిటీ ఈరోజు నిర్వహించిన ఒక కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 8 సంవత్సరాల క్రితం ప్రవేశపెట్టిన GST విధానాన్ని పునర్నిర్మించే ముందు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా సమీక్షించి రాష్ట్రాల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నామన్నారు. పన్ను రేట్లు తగ్గించడంతో పాటు ఆదాయపు పన్ను చట్టాన్ని కూడా మరింత సమకాలీనంగా మార్చామని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు GST సంస్కరణల నుండి ప్రయోజనం పొందుతారని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు.

(వాయిస్ 30 సెకన్లు)

======================

ఆదాయపు పన్ను చట్టంలోను, జీఎస్టీ లోను గణనీయమైన సంస్కరణలు జరిగాయని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా (PAFI) వార్షిక సదస్సులో ఆయన మాట్లాడుతూ.. భద్రతకు సంబంధించిన ప్రాజెక్టుల కోసం భారతీయ రైల్వే ప్రతి సంవత్సరం ఒక లక్షా 30 వేల కోట్ల రూపాయలకు పైగా మొత్తాన్ని ఖర్చు చేస్తోందని చెప్పారు. 2013-14 సంవత్సరంలో 170గా ఉన్న రైలు ప్రమాదాల సంఖ్య.. ప్రభుత్వం నిరంతరం చేపడుతున్న భద్రతా చర్యల కారణంగా 31కి తగ్గిందన్నారు. GST లో చేపట్టిన సంస్కరణల ఫలితంగా గృహోపకరణాలు, పాల ఉత్పత్తులు, వ్యవసాయ యంత్రాల ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయన్నారు.

(వాయిస్ 28 సెకన్లు)

======================

నేపాల్ నూతన ప్రధానమంత్రి సుశీలా కార్కితో ఈరోజు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోన్‌లో సంభాషించారు. దశాబ్దాల నాటి భారత్ నేపాల్ దేశాల స్నేహసంబంధాలను ఈ సందర్భంగా ఇరువురు గుర్తు చేసుకున్నారు. నేపాల్ లోని ప్రస్తుత రాజకీయ పరిణామాలను సుశీలా కార్కి నరేంద్ర మోదీకి వివరించారు. ఈ సందర్భంగా భారత ప్రధానమంత్రి.. పొరుగు దేశంగా నేపాల్‌కు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. నేపాల్ - భారత్ దేశాల మధ్య సంబంధాలు, ద్వైపాక్షిక ఆసక్తికి సంబంధించిన అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. రేపు నేపాల్ జాతీయ దినోత్సవం సందర్భంగా నరేంద్ర మోదీ.. ఆ దేశ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

======================

ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో చమోలి జిల్లా నందనగర్ ప్రాంతంలోని నాలుగు గ్రామాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. భారీ వర్షాలు, వరదలలో 14 మంది గల్లంతయ్యారని, మరో 20 మంది గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. 35 ఇళ్ళు దెబ్బతిన్నాయని, ఇప్పటివరకు దాదాపు 200 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి.. ఆ రాష్ట్ర విపత్తు నిర్వహణ కార్యదర్శి వినోద్ కుమార్ సుమన్‌తో పరిస్థితిని సమీక్షించి తక్షణ సహాయక చర్యలకు ఆదేశించారు.

విరామం

======================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు పెద్దపీట వేస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. “సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా యావత్ ప్రపంచాన్ని కలవరపెడుతున్న వాతావరణ మార్పులను తగ్గించేందుకు భారత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఒక ప్రత్యేక కథనాన్ని ఇపుడు విందాం!!

(వాయిస్ 95 సెకన్లు)

======================

మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖా మంత్రి అన్నపూర్ణాదేవి తెలిపారు. ఈరోజు ఆమె ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాతో కలిసి సేవా పఖ్వాడా కార్యక్రమం కింద నిర్మించిన 502 పాల్నా- అంగన్వాడీ కమ్ క్రెచ్ కేర్ సెంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణాదేవి మాట్లాడుతూ... మహిళా ఉద్యోగులు ఈ కార్యక్రమం ద్వారా అధిక ప్రయోజనం పొందుతారన్నారు. పిల్లలకు

సురక్షితమైన పెంపక కేంద్రాలు అందుబాటులో ఉంటాయని, ఈ కేంద్రాలు చిన్నారులకు పోషకాహారంతో పాటు విద్యా సేవలను కూడా అందిస్తాయని మంత్రి తెలియజేశారు.

=======================

దేశవ్యాప్తంగా ఏడు కొత్త సహజ వారసత్వ ప్రదేశాలకు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల తాత్కాలిక జాబితాలో స్థానం లభించింది. దీంతో ఈ జాబితాలో ఉన్న భారత దేశపు వారసత్వ ప్రదేశాల సంఖ్య 62 నుండి 69కి చేరింది. ఇక ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌లోని ఎర్రమట్టి దిబ్బలు, తిరుమల కొండలు మహారాష్ట్ర నుండి పంచగని, డెక్కన్ ట్రాప్స్, మహాబలేశ్వర్ కర్ణాటక నుండి సెయింట్ మేరీస్ ఐలాండ్ క్లస్టర్, మేఘాలయలోని ఏజ్ కేవ్స్, నాగహిల్ ఓఫియోలైట్, కేరళ లోని వర్కల క్లిఫ్స్ కూడా ఉన్నాయి.

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=======================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. ఉదయం 82,693 పాయింట్లతో సెన్సెక్స్ లాభాల్లో ప్రారంభమై.. చివరకు 320 పాయింట్లతో 83,013 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 75 పాయింట్లు పెరిగి 25,405 వద్ద ముగిసింది.

=======================

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలలో రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలిపింది. అలాగే.. ఈశాన్య రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, సిక్కింలలో కూడా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఇక గోవా, మధ్య మహారాష్ట్రతో సహా పశ్చిమ ప్రాంత రాష్ట్రాల్లోనూ ఇలాంటి పరిస్థితులే ఉంటాయని వెల్లడించింది.

=======================
=======================